RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాదరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@UstudioTV
94940 54338

RANGAREDDY, EDITION : 01, VOLUME :172 EDITOR: CHERUKU UPENDAR, DATE : MONDAY 06 NOVEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 172 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : సోమవారం 06 నవంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-



# టీంఇండియా విజయం

▶ దుమ్మురేపిన బ్యాటర్లు, కుప్పకూల్చిన బౌలర్లు ▶ 243 పరుగుల తేడాతో సఫారీపై ఘన విజయం ▶ విరాట్ కోహ్లి రికార్డు 49వ సెంచరీ
▶ రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయాజాలం ▶ భారత్ 326/5, దక్షిణాఫ్రికా 83/10



**కోల్‌కత- ప్రభాత సూర్యుడు**

ఎనిమిదికి ఎనిమిది. టీమ్ ఇండియాకు ఎదురేది. ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ 243 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. రవీంద్ర జడేజా (5/33) ఐదు వికెట్ల మ్యాజిక్‌కు మహ్మద్ షమి (2/18), కుల్దీప్ యాదవ్ (2/7) విజృంభించటంతో ఛేదనలో దక్షిణాఫ్రికా 27.1 ఓవర్లలో 83 పరుగులకే చేతులెత్తేసింది. టెయిలెండర్ మార్కో జాన్సెన్ (14, 30 బంతుల్లో 1 ఫోర్) సఫారీ శిబిరంలో టాప్ స్కోరర్. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా 50 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి

మిగతా 2లో

బ్యాటర్లకు తిరుగులేదు. బౌలర్లకు ఎదురులేదు. ఇదీ ఐసీసీ 2023 ప్రపంచకప్‌లో ఆతిథ్య టీమ్ ఇండియా జైత్రయాత్ర. అగ్ర జట్టు, కఠిన ప్రత్యర్థి దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో కాస్తో కూస్తో ఉత్కంఠ ఆశించిన తటస్థ భిమానులకు నిరాశే ఎదురైంది. టీమ్ ఇండియా జైత్రయాత్ర ముంగిట దక్షిణాఫ్రికా తేలిపోయింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 83 పరుగులకే కుప్పకూలగా రవీంద్ర జడేజా (5/33) ఐదు వికెట్ల మాయజాలం ప్రదర్శించాడు. విరాట్ కోహ్లి (101 నాటౌట్), శ్రేయస్ అయ్యర్ (77) మెరుపులతో తొలుత భారత్ 326 పరుగుల భారీ స్కోరు చేసింది. 243 పరుగుల తేడాతో సఫారీని చిత్తు చేసి గ్రూప్ దశలో వరుసగా ఎనిమిదో విజయం సాధించింది.



## బీహార్ ప్రభుత్వ కులగణనపై
# అమిత్‌షా ఆరోపణలు

**పాట్నా - ప్రభాత సూర్యుడు**

బీహార్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా పలు ఆరోపణలు చేశారు. నితీష్ కుమార్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో ఉద్దేశపూర్వకంగానే ముస్లిం, యాదవుల జనాభాను పెంచి చూపారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగానే ఈ చర్య చేపట్టారని అన్నారు. ఆదివారం ముజఫర్‌పూర్ జిల్లాలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. జెడి (యు) ఎన్‌డిఎ భాగస్వామ్యంలో ఉన్నప్పుడే రాష్ట్రంలో కులగణ చేపట్టాలన్న నిర్ణయం తీసుకున్నారని అన్నారు. నితీష్‌కుమార్ గతేడాది జెడి(యు) బిజెపితో తెగతెంపులు చేసుకుని, ప్రతిపక్ష కూటమి 'ఇండియా' లో చేరిన సంగతి తెలిసిందే. ప్రధాని మోడీని వ్యతిరేకించడమే 'ఇండియా' కూటమి ప్రధాన అజెండా అని

మిగతా 2లో

# 2024 నుంచే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

దేశంలో మహిళా రిజర్వేషన్లపై తెలంగాణ ఎమ్మెల్సీ, భారత్ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్లపై మరో పోరాటం చేస్తామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2024 సార్వత్రిక ఎన్నికల నుంచే అమలు చేయాలనే డిమాండ్‌తో మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు కవిత స్పష్టం చేశారు. కాగా, తాజాగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో తాము చేసిన పోరాటానికి దిగి

మిగతా 2లో

## ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల జాబితాలో
# మొదటిస్థానంలో ఢిల్లీ

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు**

ప్రపంచంలోనే 10 అత్యంత కాలుష్య నగరాల జాబితాల్లో మరోసారి ఢిల్లీ ప్రథమ స్థానంలో నిలిచింది. ఢిల్లీలో ఆదివారం ఉదయం వాయు నాణ్యతా ప్రమాణం ( ఎక్యూఐ) 438గా నమోదైన సంగతి తెలిసిందే. స్విస్ ఎయిర్ మానిటర్ ఐక్యూఎఐఆర్ ఆదివారం ఈ జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో కోల్‌కతా (ఎక్యూఐ 206)తో మూడోస్థానంలో నిలవగా, ముంబయి (ఎక్యూఐ 162)తో ఆరోస్థానంలో నిలిచింది. పాకిస్తాన్ లోని లాహెూర్

మిగతా 2లో





## గచ్చిబౌలి స్టేడియంలో మారథాన్..!
# ప్రారంభించిన సచిన్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**


గచ్చిబౌలి స్టేడియంలో 'హైదరాబాద్ ఆఫ్ మారథాన్' నిర్వహించారు. ఫెడరల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన జెండా ఊపి 20కె, 10కె, 5కె విభాగాల్లో మారథాన్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుల్లెల గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. యువత పెద్ద ఎత్తున మారథాన్ రన్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



# మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..!

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ వచ్చిన నాడు పరిస్థితి మీకు తెలుసు. ఆ నాడు కరెంటు లేదు. కరెంటు ఉత్పత్తి చేసే కొత్తగూడెంలో విపరీతమైన విపరీతమైన కరెంటు కోతలుండేవి. మంచినీళ్లు లేవు. కొత్తగూడెం పట్టణంలో ఆ నాడు నీళ్లు ఎట్ల వచ్చినయో.. ఇప్పుడు ఎట్ల వస్తున్నయో మీకు తెలుసు. సాగునీరు లేదు. వ్యవసాయం దండగైపోయింది. బతక వలసలుపోవాల్సిన పరిస్థితి. చాలా దారుణమైన పరిస్థితి ఉండేది. పేదల గతి ఘోరంగా ఉండేది. ముసలివారిని ఆదుకునే వారు లేరు' అన్నారు. 'పెన్షన్ ఇస్తే రూ.40, రూ.70, రూ.200 ఇచ్చేవారు. ఆనాడు చెట్టుకొకరు గుట్టకొకరైన తెలంగాణను ఓ దరికి తేవాలని.. ఓ పాలసీ ప్రకారం మొదట కరెంటు బాధలు తీర్చుకున్నాం. మంచినీళ్ల బాధ లేదు. కరెంటు అప్పటికీ ఇప్పటికీ పోలిక లేదు. యాదాద్రి పవర్ స్టేషన్ పూర్తయితే 4వేల విద్యుత్‌శ్చక్తి వస్తుంది. కొత్తగూడెం జిల్లానే సమైక్య రాష్ట్రం ఎవరూ చేయకపోదురు. స్వరాష్ట్రంలో జిల్లాకావడంతో పాటు మెడికల్ కాలేజీ వచ్చింది. ఏ చిన్న జబ్బు వచ్చినా ఖమ్మం, హైదరాబాద్‌కు పోవాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఇక్కడే బ్రహ్మాండమైన ఆసుపత్రి వచ్చింది. 60-70 మంది వైద్యులున్నారు. అందరికీ మంచి వైద్యం అందుతున్నది. గతంలో కిడ్నీ బీమార్ ఉంటే.. డయాలసిస్ సెంటర్ లేదు. ఇప్పుడు కొత్తగూడెంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశాం. పేషెంట్లకు సైతం పెన్షన్ ఇస్తున్నాం' అంటూ గుర్తు చేశారు. గిరిజనులకు పంచాల్సిన పోడు భూములను కొత్తగూడెం జిల్లాలో 16,769 ఎకరాల భూమి పట్టాలు ఇవ్వడం జరిగింది. 4,500 కుటుంబాలకు లబ్ధి జరిగింది. పట్టాలు ఇవ్వడంతో పాటు కేసులను ఎత్తివేయడంతో పాటు రైతుబంధు అమలు చేయడంతో పాటు బీమా ఇస్తున్నాం. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో కాని పని. ఆ రోజు బోరు వేస్తే 800-600 ఫీట్లు వేసినా నీరు లేదు. కానీ ఈ రోజు భారతదేశంలో భూగర్భ జలాలు అడుగంటు తుంటే.. తెలంగాణలో మాత్రమే భూగర్భ జలాలు పైకి వచ్చాయ్. ఇది మన లెక్క కాదు.. కేంద్రం లెక్క. 739 టీఎంసీల భూగర్భ జలాలు రీఛార్జి జరిగి భూమిలో ఉన్నాయి. రెండు నాగార్జున సాగర్లకు సమానమైన నీరు తెలంగాణ భూమిలో ఉన్నది. గతంలో గోదావరిని చూసి సంతోషపడేది తప్పా.. చారెడు నీళ్లు రాకపోయేది. భద్రాచలం వెళ్లినప్పుడుల్లా గోదావరికి దండం పెట్టడం.. రూపాయి నాణెం వేయడం తప్పా నీళ్లు రాలేదు' అని తెలిపారు. 'ఈ రోజు బ్రహ్మాండంగా సీతారామ ప్రాజెక్టు కడుతున్నాం. 70శాతం పూర్తయ్యింది. కొద్ది రోజుల్లోనే పూర్తవుతుంది. వచ్చేది మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.. అందులో డౌట్ లేదు. నేను వచ్చి ఆ ప్రాజెక్టుకు కూడా శంకుస్థాపన చేస్తా. గతంలో కరెంటు ఏ విధంగా ఉండేది. చిన్న హెూటల్ నడిపితే.. గిరాకీ రూ.1000 అయితే.. కరెంటు బిల్లు మాత్రం రూ.1500 వచ్చేది. కొత్తగూడెంలో రోడ్లన్నీ బాగు చేసుకున్నాం. సెంట్రల్ లైటింగ్‌ను పెట్టుకున్నాం. అప్పటికీ ఇప్పటికీ రూపురేఖలు చాలా వరకు మారిపోయాయి. ముర్రేడువాగు పట్టణంలోని కొన్ని ప్రాంతాలను ముంచివేస్తున్నది. శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోరారు. రూ.30-40కోట్లు మంజూరు చేశాం. పనులు పూర్తయితే ముంపు సమస్య నుంచి బయటపడుతాం. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకుంటున్నాం' అన్నారు."



### ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల జాబితాలో
# మొదటిస్థానంలో ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

(ఎక్యూఐ 371)తో రెండవ స్థానంలో, కరాచీ (ఎక్యూఐ 162)తో ఐదవ స్థానాల్లో నిలవగా, బంగ్లాదేశ్ రాజధాని ఢాకా (ఎక్యూఐ 189)తో నాల్గవ స్థానంలో నిలిచింది. తగ్గుతున్న ఉష్ణోగ్రతలు, గాలి లేకపోవడం, పంటవ్యర్థాల దగ్ధంతో వాయు కాలుష్యం తీవ్రంగా పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఢిల్లీలోని సుమారు 20 మిలియన్ల మంది కళ్ల మంటలు, గొంతులో దురదతో పాటు శ్వాస కోస సమస్యలతో బాధపడుతున్నారని వైద్యులు పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ 550కి చేరుతోందని అన్నారు.

### బీహార్ ప్రభుత్వ కులగణనపై
# అమిత్‌షా ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. తరువాతి ప్రధాని తానేనని నితీష్‌కుమార్ పగటి కలలు కంటున్నారని, కానీ 'ఇండియా' కూటమి ఆయనను కన్వీనర్‌గా కూడా నియమించలేదని అన్నారు. వచ్చేలోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లోని 40 స్థానాల్లోనూ బిజెపి విజయం సాధిస్తుందని అన్నారు. రాష్ట్రంలో గూండారాజ్‌కు నితీష్‌కుమారే కారణమని అన్నారు

# 2024 నుంచే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన కేంద్రం.. పార్లమెంట్ లో బిల్లును పాస్ చేసిందని చెప్పారు. చట్టంగా మారిన తర్వాత అమలు వాయిదా వేసే కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. లేదంటే తాము కూడా న్యాయపోరాటం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఇక, ఈ విషయంపై న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే ఈ విషయంపై పలు పార్టీలు, సంస్థలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయని చెప్పారు. ఆయా సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ జరుపుతోందని గుర్తుచేశారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లో భారత్ జాగృతి తరఫున తాము ఇంప్లీడ్ అవుతామని వివరించారు. ఇక, మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2024 నుంచే అమలు చేయాలనే డిమాండ్‌తో మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు కవిత వివరించారు.

# గాంధీభవన్‌లో బీఫామ్ అందుకున్న గద్దర్ కూతురు



**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు:** గాంధీభవన్‌లో బీఫామ్స్ సందడి నెలకొంది. రెండు విడతాలుగా 100 మంది అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆదివారం బీఫామ్‌లను అందించింది. ఇప్పటి వరకు 65 మంది అభ్యర్థులు బీఫామ్స్ అందు కున్నారు. ముగ్గురు అభ్యర్థులకు బీఫామ్‌లు ఆపేయాలని అధిష్టానం ఆదేశించింది. మిగతా 32 మంది అభ్యర్థులు సోమవారం తీసుకోనున్నారు. అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో వారి పిల్లలు వచ్చి బీఫామ్స్‌లు అందుకు న్నారు. వారందరికి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, విశ్వనాథ్, ఉపాధ్యక్షులు జి నిరంజన్, కుమార్‌రావు తది తరులు బీఫామ్స్ అందజేశారు. కొడంగల్ అభ్యర్థి, రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, జూబ్లీహిల్స్ అభ్యర్థి అజహరుద్దీన్, కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డితోపాటు పలు వురు ప్రముఖులు బీఫామ్స్ తీసుకున్నారు. కంటోన్మెంట్ అభ్యర్థి గద్దర్ కూతురు జి వెన్నెల స్వయంగా వచ్చి తీసు కున్నారు. జగిత్యాల అభ్యర్థి,ఎమ్మెల్సీ జీవ న్‌రెడ్డి కుమారు డు, నిర్మల్ అభ్యర్థి శ్రీహరిరావు కూతురు బీఫామ్ తీసుకు న్నారు. సోమవారం కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. వనపర్తి అభ్యర్థి జి. చిన్నారెడ్డి, చేవెళ్ల అభ్యర్థి భీంభరత్, బోథ్ అభ్యర్థి వన్నెల అశోక్‌లకు బీఫామ్‌లు ఆపేయాలని అధిష్టానం ఆదేశిం చింది. ఆయా నియోజకవర్గాల్లో వారు గెలిచే అవకాశం లేదని అధిష్టానం దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసు కున్నట్టు తెలిసింది. ఆ నియోజకవర్గాలకు బలమైన అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నారు.

## నిజ్జర్ హత్య ఆరోపణలపై ఆధారాలు సమర్పించండి

**ఒట్టావా :** ఖలిస్తానీ వేర్పాటువాద నేత నిజ్జర్ హత్య ఆరోపణలపై కెనడా ప్రభుత్వం ఆధారాలు చూపాలని భారత రాయబారి సంజయ్ కుమార్ వర్మ పేర్కొన్నారు. కెనడాతో దౌత్య సంబంధాల ప్రతిష్టంభనపై భారత వైఖరిని పునరుద్ఘాటించారు. భారత రాయబారి సంజయ్ కుమార్ వర్మ అంతర్జాతీయ మీడియా గ్లోబ్ అండ్ మెయిల్‌తో మాట్లాడారు. నిజ్జర్ హత్యలో భారతదేశ ప్రమేయం ఉందని ఆరోపించిన కెనడా, దాని మిత్ర దేశాలు ఆధారాలు చూపించలేదని స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో వారికి సహాయం చేయడానికి మాకు నిర్దిష్ట లేదా సంబంధిత సమాచారం అందించలేదు. " సాక్ష్యాలు ఎక్కడ ఉన్నాయి. విచారణ ముగింపు ఏమిటి. నేను ఒక అడుగు ముందుకు వేసి వెల్లడిస్తున్నాను. ఈ దర్యాప్తు మొత్తాన్ని తారుమారు చేశారు " అని అన్నారు. ఈ హత్యలో భారత ఏజెంట్లు ఉన్నట్లు చెప్పాలని కెనడాలోని అత్యున్నత స్థాయి అధికారుల నుండి సూచనలు వచ్చాయని అన్నారు. తనకు బెదిరింపులు వచ్చాయని .. దీంతో తనకు రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సిఎంపి) భద్రత కల్పించినట్లు వర్మ వెల్లడించారు. తన సహచర దౌత్యవేత్తలకు కెనడాలో ముప్పు పొంచి ఉందని అన్నారు.

# టీంఇండియా ఘన విజయం

(మొదటిపేజీ తరువాయి)

(101 నాటౌట్, 121 బంతుల్లో 10 ఫోర్లు) శతకంతో చెలరేగగా, శ్రేయస్ అయ్యర్ (77, 87 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్థ సెంచరీతో మెరిశాడు. సూర్యకుమార్ (22), రవీంద్ర జడేజా (29నాటౌట్, 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో మెప్పించారు. కెరీర్ 49వ వన్డే సెంచరీ సాధించిన బర్త్‌డే బారు విరాట్ కోహ్లి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్ తన చివరి మ్యాచ్‌లో నవంబర్ 12న బెంగళూర్‌లో నెదర్లాండ్స్‌తో తలపడనుంది.

**కోహ్లి శతక్కొట్టాడు :**

ఈడెన్ పిచ్ నెమ్మదించింది. పరుగుల వేట గగనమైంది. రెండో ఇన్నింగ్స్‌కు మంచు ప్రభావం ఉండనుంది. అయినా, టాస్ నెగ్గిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఓపెనర్లు రోహిత్ శర్మ (40, 24 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (23) ధనాధన ఆరంభాన్ని అందించారు. సఫారీ పేసర్లపై దండెత్తిన రోహిత్..ఆరో ఓవర్లోనే 60 పరుగుల మార్క్ దాటించాడు. ప్రమాకరంగా మారుతున్న రోహిత్‌ను రబాడ వెనక్కి పంపగా.. కండ్లుచెదిరే మాయతో గిల్‌ను కేశవ్ మహరాజ్ సాగనంపాడు. దీంతో 93 పరుగులకు భారత్ ఓపెనర్లను కోల్పోయింది. ఈ స్థితిలో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్ భారత్‌ను ముందుకు నడిపించారు. మూడో వికెట్‌కు 134 పరుగులు జోడించగా కోహ్లి 67 బంతులో అర్ధ సెంచరీ అందుకోగా, అయ్యర్ 64 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. నెమ్మదించిన పిచ్‌పై పరుగుల వేట కష్టమైనా.. తొలుత అయ్యర్ దూకుడు పెంచగా, కోహ్లి సైతం అదే బాటలో నడిచాడు. భారీ షాట్‌కు ప్రయత్నించి అయ్యర్ అవుట్ కాగా.. రాహుల్ (8) ఇబ్బంది పడ్డాడు. సూర్య (22), జడేజా (29 నాటౌట్) చివర్లో కోహ్లితో కలిసి కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. సూర్య ఐదు బౌండరీలు బాదగా.. చివరి ఓవర్లో జడేజా విశ్వరూపం దాల్చాడు. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో అజేయంగా 29 పరుగులు చేశాడు. 119 బంతుల్లో శతకం సాధించిన కోహ్లి.. 101 పరుగుల అజేయంగా నిలిచాడు. సఫారీ బౌలర్లలో ఎంగిడి,రబాడ, జాన్సెన్, మహరాజ్, షంషి తలా ఓ వికెట్ పడగొట్టారు.

**సఫారీ చతికిల :**

మంచు ప్రభావం అనుకూలతతో సఫారీ బ్యాటర్లు రెచ్చిపోతారని అనుకుంటే.. భారత బౌలర్లు కథ మార్చేశారు. సిరాజ్ తొలి ఓవర్లోనే ఫామ్‌లో ఉన్న డికాక్ (5)ను అవుట్ చేయగా.. పవర్‌ప్లేలోనే బంతి అందుకున్న జడేజా.. సఫారీ కెప్టెన్ బవుమా (11) కథ ముగించాడు. కొత్త బంతితో జడేజా మాయజాలం ముంగిట సఫారీ బ్యాటర్లు తేలిపోయారు. స్పిన్ బాగా ఆడగల క్లాసెన్ (1), డెవిడ్ మిల్లర్ (11) జడేజాకు దాసోహం అయ్యారు. వాండర్ డుసెన్ (13), మార్క్‌రామ్ (9)లను షమి సాగనంపాడు. దీంతో 59 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా చేతులెత్తేసింది. మార్కో జాన్సెన్ (14) ఓటమి అంతరం కుదించే ప్రయత్నం చేశాడు. కుల్దీప్ యాదవ్ సైతం రెండు వికెట్లతో మెరువగా.. 27.1 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా 83 పరుగులకు కుప్పకూలింది. 243 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది.

**స్కోరు వివరాలు**

**భారత్ ఇన్నింగ్స్ :** రోహిత్ శర్మ (సి) బవుమా (బి) రబాడ 40, గిల్ (బి) మహరాజ్ 23, విరాట్ కోహ్లి నాటౌట్ 101, శ్రేయస్ అయ్యర్ (సి) మార్క్‌రామ్ (బి) ఎంగిడి 77, కెఎల్ రాహుల్ (సి) వాండర్ డుసెన్ (బి) జాన్సెన్ 8, సూర్యకుమార్ (సి) డికాక్ (బి) షంషి 22, రవీంద్ర జడేజా నాటౌట్ 29, ఎక్స్‌ట్రాలు : 26, మొత్తం : (50 ఓవర్లలో 5 వికెట్లకు) 326.

వికెట్ల పతనం : 1-62, 2-93, 3-227, 4-249, 5-285.

బౌలింగ్ : లుంగిసాని ఎంగిడి 8.2-0-63-1, మార్కో జాన్సెన్ 9.4-0-94-1, కగిసో రబాడ 10-1-48-1, కేశవ్ మహరాజ్ 10-0-30-1, షంషి 10-0-72-1, ఎడెన్ మార్క్‌రామ్ 2-0-17-0.

**దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ :** డికాక్ (బి) సిరాజ్ 5, బవుమా (బి) జడేజా 11, వాండర్ డుసెన్ (ఎల్బీ) షమి 13, మార్క్‌రామ్ (సి) రాహుల్ (బి) షమి 9, క్లాసెన్ (ఎల్బీ) జడేజా 1, డెవిడ్ మిల్లర్ (బి) జడేజా 11, మార్కో జాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 14, కేశవ్ మహరాజ్ (బి) జడేజా 7, కగిసో రబాడ (సి,బి) జడేజా 6, లుంగి ఎంగిడి (బి) కుల్దీప్ 0, షంషి నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 2, మొత్తం : (27.1 ఓవర్లలో ఆలౌట్) 83.

వికెట్ల పతనం : 1-6, 2-22, 3-35, 4-40, 5-40, 6-59, 7-67, 8-79, 9-79, 10-83.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 5-0-14-0, మహ్మద్ సిరాజ్ 4-1-11-1, రవీంద్ర జడేజా 9-1-33-5, మహ్మద్ షమి 4-0-18-2, కుల్దీప్ యాదవ్ 5.1-1-7-2.

# తెలంగాణ సిపిఎం అభ్యర్థుల తొలి జాబితా విడుదల

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల తొలి జాబితాను సిపిఎం ప్రకటించింది. మొదటి జాబితాలో 14 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్‌తో పొత్తు కోసం సిపిఎం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కాంగ్రెస్ ప్రతిపాదించిన విధంగా మిర్యాలగూడ, వైరా స్థానాలను ఇవ్వాలని సిపిఎం కోరింది. అయితే హస్తం పార్టీ నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో 17 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు సిపిఎం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తాజాగా అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేసింది. మరో మూడు స్థానాలకు అభ్యర్థులను ఆదివారం సాయంత్రం ప్రకటించే అవకాశముంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఖమ్మం జిల్లా పాలేరు నుంచి బరిలోకి దిగనున్నారు.

**అభ్యర్థుల వివరాలు...**


భద్రాచలం (ఎస్టీ) - కారం పుల్లయ్య
అశ్వారావుపేట (ఎస్టీ) - పిట్టల అర్జున్
పాలేరు - తమ్మినేని వీరభద్రం
మధిర (ఎస్సీ) - పాలడుగు భాస్కర్
వైరా (ఎస్టీ) - భూక్యా వీరభద్రం
ఖమ్మం - ఎర్ర శ్రీకాంత్
సత్తుపల్లి (ఎస్సీ) - మాచర్ల భారతి
మిర్యాలగూడ - జూలకంటి రంగారెడ్డి
నకిరేకల్ (ఎస్సీ) - చినవెంకులు
భువనగిరి - కొండమడుగు నర్సింహ
జనగాం - మోకు కనకారెడ్డి
ఇబ్రహీంపట్నం - పగడాల యాదయ్య
పటాన్‌చెరు - జె. మల్లికార్జున్
ముషీరాబాద్ - ఎం. దశరథ్

# ముకేష్ అంబానీకి బెదిరింపులు.. తెలంగాణ వ్యక్తి అరెస్ట్..

**ముంబయి - ప్రభాత సూర్యుడు::** ప్రముఖ వ్యాపారవేత్త, రిలయన్స్ అధినేత ముకేష్ అంబానీకి ఇటీవల బెదిరింపు ఈమెయిల్స్ వచ్చాయి. ఈ కేసులో నిందితుడిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. ముకేష్ అంబానీ నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ.. ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరింపులు వచ్చాయి. ఈ కేసును విచారించిని గాందేవి పోలీసులు తెలంగాణకు చెందిన 19 ఏళ్ల యువకుడిని ముంబైలో శనివారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. నిందితుడిని గణేస్ రమేష్ వనపర్థిగా గుర్తించారు. అతడిని నవంబర్ 8వ తేదీ వరకు పోలీస్ కస్టడీకి తరలించారు. ఇది కొంతమంది టీనేజర్లు చేసిన అల్లరి పనిగా పోలీసులు భావిస్తున్నారు. దీనిపై మరింత విచారణ జరుపుతున్నామని ముంబై సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. అక్టోబర్ 27న షాదాబ్ ఖాన్ పేరుతో ఈమెయిల్స్ వచ్చాయి. అంబానీ మాకు రూ.20 కోట్లు ఇవ్వకపోతే మేము చంపేస్తామని, మా దగ్గర భారతదేశంలోనే అత్యున్నత షఉటర్లు ఉన్నారంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ముకేష్ అంబానీ సెక్యూరిటీ ఇంఛార్జ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. ఈ రూ.20 కోట్ల డిమాండ్ తర్వాత ఇలాగే కొన్ని రోజుల తర్వాత రూ.200 కోట్లు డిమాండ్ చేస్తూ మరో బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. తర్వాత రూ. 400 కోట్లు చెల్లించాలని మరో ఈ మెయిల్ వచ్చాయి. అంతకుముందు కూడా ఇలాగే ముకేష్ అంబానీకి బెదిరింపులు వచ్చాయి. గతేడాది ఇలాగే బెదిరిస్తూ కాల్ చేసిన బీహార్ కు చెందిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. అంబానీ నివాసం 'యాంటిలియా'ను పేల్చేస్తామని, రిలయన్స్ ఫౌండేషన్ హాస్పిటన్ ను పేల్చేస్తామని సదరు వ్యక్తి బెదిరించాడు.

# కోర్టు తీర్పులను చట్టసభలు తోసిపుచ్చలేవు: సిజెఐ చంద్రచూడ్

**న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు:** కోర్టు తీర్పులను చట్టసభలు నేరుగా అధిగమించలేవని భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు. అయితే చట్టంలోని "లోపాన్ని సరిచేయడానికి" చట్టసభలు కొత్త చట్టాన్ని రూపొందించవచ్చునని అన్నారు. శనివారం ఒక మీడియా సంస్థ నిర్వహించిన సమావేశంలో కార్య నిర్వాహక, శాసన, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజనపై మాట్లాడుతూ, చంద్రచూడ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'కోర్టు తీర్పు వచ్చినప్పుడు చట్టసభ ఏమి చేయగలదో.. ఏమి చేయలేదో అనే దానికి మధ్య విభజన రేఖ ఉంది. ఒక నిర్దిష్ట సమస్యను నిర్ణయించే న్యాయస్థానం తీర్పు ఒక చట్టంలోని లోపాలను ఎత్తిచూపినట్లయితే, ఆ లోపాన్ని సరిదిద్దటానికి తాజా చట్టాన్ని రూపొందించడానికి చట్టసభలకు ఎల్లప్పుడూ అవకాశం ఉంటుంది. కోర్టు తీర్పు తప్పు అని భావిస్తున్నామని, అందువల్ల తీర్పును రద్దు చేస్తామని చట్టసభ చెప్పలేదు' అని చంద్రచూడ్ తెలిపారు. 'న్యాయస్థానం యొక్క తీర్పును చట్ట సభ నేరుగా తిరస్కరించజాలదు.. అది ఎంతమాత్రం అనుమతించరానిది' అని అన్నారు. 1951లో విద్యాసంస్థలకు రిజర్వేషన్ నిబంధనలు వర్తింపజేయబోమని సుప్రీంకోర్టు తీర్పు పేర్కొన్నప్పుడు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు తీసుకొచ్చేందుకు పార్లమెంట్ చట్టాన్ని సవరించిందని చంద్రచూడ్ గుర్తు చేశారు.




'న్యాయమూర్తులు కేసులను పరిష్కరించినప్పుడు సమాజం ఎలా స్పందిస్తుందో చూడరు' అని అన్నారు. 'ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికి, ప్రజల చేత ఎన్నిక కాని న్యాయవ్యవస్థకు మధ్య ఉన్న వ్యత్యాసం ఇది. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వం వారి స్పందనలకు ప్రతిస్పందిస్తుంది. న్యాయవ్యవస్థ ఇలా చూడదు' అని అన్నారు. న్యాయమూర్తులు రాజ్యాంగ నైతికతకు లోబడి నడుచుకుంటారే తప్ప ప్రజాకర్షక నైతికతకు కాదని ఆయన అన్నారు. న్యాయమూర్తులు ప్రజలచే ఎన్నుకోబడకపోవడం మన న్యాయ వ్యవస్థ ప్రక్రియ యొక్క బలం అని, అది "లోపం" కాదని ఆయన అన్నారు. అలాగే .న్యాయవ్యవస్థలో మహిళలు, అట్టడుగు వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని గురించిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, "న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించే సమయంలోనే నిర్మాణాత్మక అడ్డంకులు ఉన్నాయి" వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉదాహరణకు సిఎల్‌ఎటి (కామన్ లా అడ్మిషన్ టెస్ట్)ను ఎక్కువగా ఆంగ్లంలో నిర్వహిస్తారని, దీంతో పట్టణ ప్రజలు, సౌకర్యాలు ఎక్కువగా ఉన్న ప్రజలు ఈ పరీక్షలో ఎక్కువగా ఉత్తీర్ణత సాధిస్తారని తెలిపారు.

## వద్దన్న వారికి టిక్కెట్

మెదక్ - ప్రభాత సూర్యుడు

బీజేపీ మూడో జాబితా విడుదలైన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఓ పేరు చర్చనీయాంశంగా మారింది. పోటీ నుంచి విరమించుకున్నట్లు సదరు నేత ప్రకటించినప్పటికీ? మూడో జాబితాలో ఆయన పేరు ఉండటం టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది. నేను ఈసారి ఎన్నికల్లో పోటీ చెయ్యను అని ప్రకటించిన సినీ నటుడు, మాజీ మంత్రి పి బాబూమోహన్ పేరును భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థుల మూడో లిస్టులో ఖరారు చేసింది. అందోల్ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించి అందరిని ఆశ్చర్యంలో ముంచింది. తన పేరు మొదటి లిస్టులో చేర్చకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన బాబూమోహన్? వచ్చే ఎన్నికల్లో పోటీచేయబోనని అతను స్పష్టమైన ప్రకటన కూడా చేశారు. తాను ఫోన్ చేసినా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి కిషన్ రెడ్డి కానీ, ఇతర నాయకులూ కానీ ఫోన్ కూడా ఎత్తటం లేదని బాధపడ్డారు. అయితే ఈ రోజు తన పేరుని అందోల్ అభ్యర్థిగా ప్రకటించినా ,బాబూమోహన్ ఎన్నికల్లో పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నాడో లేదోనని పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాబు మోహన్, బీజేపీ పార్టీ తరపున 2018 ఎన్నికల్లో అందోల్ నుండి పోటీచేసి డిపాజిట్ కోల్పోయాడు.మొదటి లిస్ట్ లో ఉమ్మడి మెదక్ జిల్లా నుండి నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించిన బీజేపీ నాయకత్వం, గురువారం రోజు విడుదల చేసిన మూడో లిస్ట్ లో మరో నలుగురు అభ్యర్థుల పేర్లని ప్రకటించింది. బాబూమోహన్ తో పాటు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, దామోదర రాజా నరసింహ సొంత తమ్ముడు అయినా రామచందర్ రాజానరసింహ ని, తమ జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించింది. అదేవిదంగా నారాయణఖేడ్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ జనేవాడే సంగప్పని, మెదక్ నియోజకవర్గ అభ్యర్థిగా పల్లె విజయ కుమార్ ని ప్రకటించింది.అయితే పార్టీ నాయకత్వం? సంగారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ అభ్యర్థుల ప్రకటనను వాయిదా వేసింది. శుక్రవారం నుండి నామినేషన్స్ దాఖలు చేయటం ప్రారంభం అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు బీజేపీ తన అభ్యర్థుల పూర్తి జాబితాని కూడా ప్రకటించక పోవడం తో పార్టీ నాయకులను తీవ్ర నిరాశలో ముంచింది. సంగారెడ్డి నుండి పులిమామిడి రాజు ముదిరాజ్, రాజేశ్వర్ దేష్పాండే, ఇతర నాయకులూ పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. సిద్ధిపేట నుండి దూది శ్రీకాంత్ రెడ్డి,నాయిని నరోత్తం రెడ్డి, ఇతర నాయకులూ టికెట్ ఆశిస్తున్నవారిలో ఉన్నారు. బీజేపీ పార్టీ తరపున దుబ్బాక నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు, నర్సాపూర్ నుండి ఎర్రగొల్ల మురళి యాదవ్, గజ్వేల్ నుండి ఈటల రాజేందర్, పఠాన్ చెరువు నుంచి నందీశ్వర్ గౌడ్ ఎన్నికల బరిలో ఉన్నారు.

## బీజేపీ లో చేరే వారే అవినీతిపరులు : కేజ్రీవాల్


న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు



అవినీతికి వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వ పోరాటం ఓ 'జిమ్మిక్కు' అని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. హర్యానాలోని రోహ్ తక్‌లో ఆప్ ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అవినీతికి, నేరానికి పాల్పడిన వ్యక్తి బీజేపీ లో చేరగానే.. ఈడీ,సీబీఐ, ఐటి వంటి దర్యాప్తు సంస్థలు అతనిని తాకేందుకు కూడా సాహసించవని విమర్శించారు. 'అవినీతి పరులంటే ఇడి విచారణతో జైలు పాలైన వారు కాదు. ఈడీ భయంతో బీజేపీ లో చేరిన వారే అవినీతి పరులు. ఇడి దాడులతో జైలు పాలైన వారు, బీజేపీ లో చేరని వారు నిజాయితీపరులు. ఎప్పటికైనా వారు జైలు నుంచి బయటికి వస్తారు" అని అన్నారు. నిజాయితీ లేనివారు జైలుకెళ్తే.. జీవితాంతం జైలులోనే ఉండాల్సివస్తుందని వారికి తెలుసని, అందుకే బీజేపీ లో చేరతారని చెప్పారు. అవినీతిపరులు, నిజాయితీపరుల మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా తెలుసుకోవాలని అన్నారు. ఇటీవల ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేజ్రీవాల్‌కు ఇడి సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి

కోదాడ - ప్రభాత సూర్యుడు : కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గిరిజనుల అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సైదా నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 7వా వార్డు కౌన్సిలర్ ధరావత్ కైలా స్వామి నాయక్ వారి అనుచరులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. 9 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ గిరిజనులను మోసం చేసింది అన్నారు. కేవలం ఓట్ల కోసమే అధికార పార్టీ రాజకీయం చేస్తుంది తప్ప గిరిజనుల సంక్షేమం కోసం చేసింది ఏమీ లేదన్నారు. దారి పొడవునా గిరిజనులు ఘన స్వాగతం పలుకుతూడీజే మోతలతో గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సైదా నాయక్,పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల. లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, పట్టణ అధ్యక్షులు వంగవీటి రామారావు,వంటి పులి వెంకటేష్, శంకర్ నాయక్, రామిశెట్టి. హరిప్రసాద్, బిక్షం, వాల్యా నాయక్, రాజు నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై నికరంగా పోరాడుతున్న సీపీఐ(ఎం)

వైరాటౌన్ - ప్రభాత సూర్యుడు :



రాజకీయాలు వ్యాపారంగా మారిన ప్రస్తుత సమాజంలో చట్టసభల్లో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం చాలా ఉన్నదని, ప్రజల పక్షాన నికరంగా నిలబడి నిజా యితీగా పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని, ఓట్లు వేసి గెలిపి ంచాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు విజ్ఞప్తి చేశారు. వైరా నియోజకవర్గ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా చైతన్యంతో ఆలోచించి సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీం్భద్రంకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని ఆదివారం వైరా పట్టణంలోని మధు విద్యాలయం నందు ఆపార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పోతినేని మాట్లాడుతూ.. బీజేపీని ఓడించగలిగే పార్టీకి సీపీఐ(ఎం) మద్దతు ఇవ్వాలనే పార్టీ కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు మునుగోడు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌తో ఎన్నికల సర్దుబాటుకు ప్రయత్నించామని, కానీ కేసీఆర్ బీజేపీతో ఒప్పందం చేసుకోవడంతో తెగదెంపులు చేసుకున్నామని తెలిపారు. తర్వాత కాంగ్రెస్ జాతీయ నాయకత్వం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రానికి ఫోన్ చేసి ఎన్నికల్లో కలిసి పోదామని కోరడంతో సీట్ల సర్దుబాటు కోసం ప్రయత్నం చేశామని, కాని పార్టీ రాష్ట్ర కమిటీ అడిగిన స్థానాలు ఇవ్వకుండా కాంగ్రెస్ అవమానపరచిందని, చివరికి వారు ఇస్తానన్న మిర్యాలగూడ, వైరా నియోజకవర్గాలను కూడా ఇవ్వకుండా మోసం చేసిందని అన్నారు. బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) ప్రధాన లక్ష్యం అన్నారు. నవంబర్ 10న వైరా నియోజకవర్గం సీపీఐ(ఎం) అభ్యర్థి భూక్య వీరభద్రం నామినేషన్ దాఖలు చేస్తారని, నామినేషన్ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుండి పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. అనంతరం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) సత్తా చాటేందుకు ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని, ఎర్రజెండా గురించి అవాకులు, చవాకులు పేలుతున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. సీపీఐ(ఎం) వైరా నియోజకవర్గం అభ్యర్థి భూక్య వీరభద్రం మాట్లాడుతూ.. అసెంబ్లీలో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం లేకపోతే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, దీనిని ప్రజలు అర్థం చేసుకొని సీపీఐ(ఎం)కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, పారుపల్లి ఝాన్సీ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, వైరా నియోజకవర్గం మండలాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇక ఇంగ్లీషు మస్ట్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు :




తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇకపై ఇంగ్లిష్‌లోనే మాట్లాడాలని, ఇంగ్లిష్‌లోనే బోధించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. అవసరాన్ని బట్టి తెలుగు, ఉర్దూలను కూడా వినియోగించాలని తెలిపింది. సర్కారు బడుల్లో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలిచ్చింది.గత విద్యాసంవత్సరంలో 1 –8 తరగతులు, ఈ ఏడాది 9వ తరగతిలో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో ఇంగ్లిష్ మీడియం చదువుల అమలుపై పాఠశాల విద్యాశాఖ సమీక్షించింది. ఇంగ్లిష్ మీడియం బోధనలో అనేక సవాళ్లు ఎదురవుతున్నట్టు విద్యాశాఖ గుర్తించింది. ఈ సమస్యల పరిష్కారానికి 'ఇంగ్లిష్' తప్పనిసరి అని భావించిన ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయులకు అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాటించాల్సిందే.ముఖ్యంగా తెలుగు, ఉర్దూ మీడియం టీచర్లనే నియమించడంతో భాషేతర సబ్జెక్టులను ఇంగ్లిష్‌లో బోధించడం కష్టమవుతుందని, తరగతి గదిలో బోధన తెలుగు, ఉర్దూలోనే కొనసాగుతున్నదని గుర్తించింది. ఇక విద్యార్థులు కూడా ఇంగ్లిష్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రాలను అర్థం చేసుకోలేకపోతున్నారని, ఇంగ్లిష్‌లో రాయలేకపోతున్నారని తేల్చింది. ఈ సమస్యలను అధిగమించేందుకు నిపుణులతో చర్చించి కొన్ని మార్గదర్శకాలను రూపొందించింది. ఆయా మార్గదర్శకాలను పాటించాలని డీఈవోలకు సూచించింది. విద్యార్థుల పదజాలాన్ని, పఠన నైపుణ్యాలను పెంపొందించేందుకు, బహుభాషా, అనువాద పద్ధతులను అవలంబించాలని ఆదేశించింది. ఉపాధ్యాయులు 7వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించిన కృత్యాలు, సూచనలు, ప్రయోగాలకు, ఆటలను తెలుగు, ఉర్దూలో నిర్వహించినా.. ఇదంతా 8, 9 తరగతుల్లో పూర్తిగా ఇంగ్లిష్‌లోనే జరగాలి. ఈ విద్యార్థులు పదోతరగతికి వచ్చేసరికి ఇంగ్లిష్ వాడాలి. ఇంగ్లిష్ నైపుణ్యాల వృద్ధికి టీచర్లు దీక్షా పోర్టల్, ఇతర వెబ్‌సైట్ల వీడియోలను వినియోగించుకోవచ్చు. మౌఖిక కార్యకలాపాల ద్వారా విద్యార్థులు కాన్సెప్ట్‌ను సహేతుకంగా తెలుసుకొన్నాక, పాఠ్యాంశాలను ఇంగ్లిష్‌లో చదవడం అనుసరించాలి. బోధనలో బహుల భాషలు వాడాలి. ముఖ్యమైన ఇంగ్లిష్ పదాలను బోర్డుపై రాయాలి. ఇంగ్లిష్ దినపత్రికలు, మ్యాగ్జిన్లు చదవాలి. ఇంగ్లిష్ టీవీ చానళ్లను వీక్షించాలి.

## మునుగోడు ఉపఎన్నికల్లో నైతిక విజయం నాదే..!

**- మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

మునుగోడు-ప్రభాతసూర్యుడు: :



మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అసెంబ్లీలో అవకాశం దొరికినప్పుడల్లా నియోజకవర్గంలోని ప్రతి సమస్య మీద మాట్లాడిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నియో జవర్గ ప్రజలకు న్యాయం జరగాలంటే నా చేతిలో ఉన్న ఎమ్మెల్యే పదవి రాజీనామా అస్త్రాన్ని వదిలితేనే ప్రగతి భవన్ గోడలు బద్ధలై కేసీఆర్ మునుగోడు నియో జకవర్గ ప్రజల కాల దగ్గరికి వచ్చాడని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజ గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తమ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి నియోజకవర్గంలోని ఏడు మండలాల నుండి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ సమస్యల గురించి అసెంబ్లీలో కొట్లాడిన తప్పిస్తే మునుగోడు గడ్డ ప్రజలు ఎక్కడా తలదించుకునే పని చేయలేదన్నారు. పార్టీ మారినా మళ్లీ కాంగ్రెస్‌లోకే వచ్చినా.. నా ఏకైక లక్ష్యంకేసీఆర్ నియంత పాలనను అంతమొందిం చడమేనన్నారు.మునుగోడు నియో జకవర్గంలో రాజగోపాల్ రెడ్డి అంటే ప్రాణమిచ్చే వాళ్లు లక్ష మంది ఉన్నారు.. రాజగోపాల్‌రెడ్డికి ప్రజాబలం ఉందన్నారు.ఒక ఎమ్మెల్యేని ఓడించేందుకు కేసీఆర్ ప్రభుత్వయంత్రాంగం వంద మంది ఎమ్మెల్యేను తీసుకొచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు.నా పదవి మునుగోడు ప్రజల కోసం వదిలిపెడితే మునుగోడు ప్రజలు ఎక్కడున్నారు అని అధికార యంత్రాంగం వంద మంది ఎమ్మెల్యేలు వచ్చి గట్టుప్పల్ మండలం, చండూరును రెవెన్యూ డివిజన్ చౌటుప్పల్లో వంద పడకల ఆసుపత్రి నియోజవర్గంలోని ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నా రాజీనామా ఫలితంగానే వచ్చాయని తెలిపారు. ఆ మూడు నెలలు నిద్రపోకుండా వందమంది ఎమ్మెల్యేలను నియోజవర్గంలో దింపి గల్లి గల్లిన ప్రజల కాళ్లు వేళ్ళు పట్టుకున్న నా పైన అభిమానంతో ఈ కార్యక్రమంలో87 వేల ఓట్లు వచ్చాయంటే మొన్నటి ఉప ఎన్నికల్లో ఎవరు గెలిచారంటే నైతికంగా రాజగోపాల్‌రెడ్డి గెలిచారని ప్రపంచమంతా చెబుతోందన్నారు.ఇప్పుడున్న మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల నియోజకవర్గానికి 100 సార్లు వచ్చినా ఒకటే..నేను ఒక్కసారి వచ్చినా ఒక్కటేనన్నారు.ఏ రాజకీయ సంచలనం జరగాలన్న.. రాజకీయ పెను తుఫాను రావాలన్నా మునుగోడు గడ్డమీది నుండే జరుగుతుందన్నారు. అభివృద్ధి అంటే సిరిసిల్ల సిద్ధిపేట అభివృద్ధి చేస్తే రాష్ట్రమంతా చేసినట్లేనా అని ప్రశ్నించారు.లక్ష కోట్లు అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ఎందుకు కుంగిపోయిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి నీర్లకంటి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్‌నేత, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి, చౌటుప్పల్ ఎంపీపీ తాండూర్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు , సర్పంచులు, ఎంపీటీసీలు , మాజీ సర్పంచులు తదితరులు ఉన్నారు.



## సచిన్‌తో రిహాబ్ రన్నర్స్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

రిహాబ్ రన్నర్స్ పరుగులు పెడుతూనే ఉన్నారు. ప్రముఖుల ప్రశంసలు అందు కుంటున్నారు. తాజాగా ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన మారథాన్‌లో ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుల్లెల గోపీచంద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రముఖ కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ ఇస్తున్న రిహాబ్‌తో గుండె జబ్బులకు గురైన వారు, శస్త్రచికిత్స చేయించుకున్న వారు సైతం కిలోమీటర్ల మేర పరుగులు పెడుతూ ఔరా అనిపిస్తున్న విషయం విదితమే. ఒక్కసారి గుండె జబ్బుకు గురైతే పడకకే పరిమితమవుతారనే భావన ఉన్న సమాజానికి రిహాబ్ చేయించుకుని పరుగులు తీస్తున్న వారిని చూస్తే అక్కడే ఆగిపోతున్నారు. ప్రస్తుతం ప్రముఖులు సైతం వారి పరుగులకు ఆకర్షి తులవుతున్నారు. తాజాగా సచిన్ ప్రశంసలను అందుకుని మురిసిపోయారు. 20 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల విభాగాల్లో మారథాన్ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీసీ కులగణన చేస్తేనే బీజేపీకి మద్దతు

**- బీసీ వెల్ఫేర్ సోసియేషన్ జాతీయ అధ్యక్షులు జాజుల**



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

బీసీ ముఖ్యమంత్రితో పాటు బీసీల కుల గణన, దామాషా ప్రకారం రిజర్వేన్లు, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ప్రకటిస్తేనే బీజేపీకి మద్దతిస్తామని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన బీసీల రాజకీయ మేధో మదన సదస్సులో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 20 స్థానాల్లో మాత్రమే బీసీలకు టికెట్లు కేటాయించాయని విమర్శించారు. ఒకటి అర శాతం ఉన్న సామాజిక తరగతులకు మెజార్టీ సీట్లు ఇచ్చాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేపడుతామని చెబుతున్న రాహుల్ గాంధీ మాటలు నమ్మశక్యంగా లేవని అన్నారు. ఉదయపూర్ డిక్లరేషన్‌లో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు దిక్కులేదని విమర్శించారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ 7న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీ సదస్సులో ప్రధాని స్పష్టమైన హామి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 9న భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చిరంజీవులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని అంతం చేయాలి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

అవినీతిని అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ విజిలెన్స్ అఫీసర్ అర్విండ్ మలే?డే అన్నారు. అవినీతికి పాల్పడినా, ప్రలోభపెట్టినా నేరమేననీ, దేశ భవిష్యత్ నిర్దేశకులు ప్రభుత్వ ఉద్యోగులేననీ, వారు అవినీతికి దూరంగా ఉంటే, ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవల్ని అందించగలుగుతామని అభిప్రాయపడ్డారు. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నిర్వహించిన అవగాహనా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అవినీతికి కారణాలు, అవినీతి పద్ధతులు, వాటిని అరికట్టే విధానాలపై ఉద్యోగులకు విశదీకరించారు. అనంతరం 'నుక్కడ్' అనే నాటకాన్ని ప్రదర్శించారు. కార్య క్రమంలో హైదరాబాద్ డివిజన్ ఏడీఆర్ఎం/ఆపరేషన్స్ ఎం.కోటేశ్వరరావు, ఏడీఆర్ ఎం/ఇన్ఫ్రా ఎమ్ఏ రెహ్మాన్, సీనియర్ డి.సి.యం. వై బాలాజీ కిరణ్, సీనియర్ డి.ఇ.ఇ. కే కిరణ్ కుమార్, సీనియర్ డి.యం.ఇ. జీషన్ అహ్మద్, డి.పి.వో/కో–ఆర్డినేషన్ ఎ.జె.వి.ప్రకాష్ కుమార్, డి.ఇ.యన్/ఎస్టేట్ శశాంక్ యాదగిరి, స్టేషన్ డైరెక్టర్/కాచిగూడ కే బాలాజీ, ఎ.డి.ఇన్. హెచ్.యమ్. బాబులు, ఎ.డి.ఇ.యన్./ఎస్టేట్ బి.రాము, స్టేషన్ మేనేజర్/కాచిగూడ ఆర్.బి.మీనా తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి కావాలంటే కెసిఆర్ రావాలి

**- మున్సిపాలిటీలో జోరుగా బిఆర్ఎస్ లోకి చేరికహోరు**
**- పెద్ద అంబర్ పేట్‌లో ఎన్నికల ప్రచార కార్యాలయం ప్రారంభించిన మంచి రెడ్డి**



అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు

తెలంగాణ మరింత అభివృద్ధి కావాలంటే రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ పరిధిలో కిషన్ రెడ్డి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార కార్యాలయం ప్రారంభించారు. పెద్ద అంబర్ పేటలోని 5వ వార్డు మైత్రి శ్రీపురం కాలనీలో, 9వ వార్డులోని సూర్యవంశి, లుంబిని హిల్స్ కాలనీ, 4వ వార్డులో సాయి నగర్ వాసులతో ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సుమారు 500 కు పైగా పలువురు యువకులను, మహిళలను బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు. మున్సిపాలిటీలకు అధిక నిధులు కేటాయించి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రావాలని, జరగబోయే ఎన్నికల్లో మరొక్కసారి తనకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించి, ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు కంచర్ల సత్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్లు వద్దేపల్లి విద్యావతి విజేందర్ రెడ్డి, పాశం అర్చన దామోదర్, మాజీ కౌన్సిలర్లు దేశారం బాలకృష్ణ, చెరుకూరి రేణుక జగన్, గౌను భాస్కర్ గౌడ్, పాడి జంగయ్య, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి సత్తార్, నాయకులు దయాకర్ రెడ్డి, గోవర్ధనం ప్రవీణ్, పిల్లి నగేష్, నిరంజన్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



# 4 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రం

**- కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



చింతలపాలెం -పభాత సూర్యుడు : గడిచిన నాలుగేండ్లలో ఎమ్మెల్యే సైదిరెడ్డి దాదాపు 400ల ఎకరాలను కబ్జా చేశారంటూ ఎంపి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్‌స్థాయి, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సారి సైదిరెడ్డి గెలిస్తే పట్టా భూములు కూడా వదలడని, ఎమ్మెల్యే సైదిరెడ్డి నియోజకవర్గంలో ఉన్న ప్రజలపై పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు పెట్టించాడన్నారు. తెలంగాణ రాష్ట్రం 4 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, కాళేశ్వరం ప్రాజెక్టు ఎకరం నీళ్ళు పారకుండానే కూలిపోయిందన్నారు. చింతల పాలెం మండలంలో ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లు కొత్త చట్టాలు తెచ్చి, అభివృద్ధి చేశాం అని, ఇప్పుడు అవి జూబ్లీ హిల్స్, బంజారా హిల్స్ లా ఉన్నయానీ గుర్తు చేశారు. 60 యేండ్ల క్రింద నిర్మాణం చేపట్టిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్న బి.ఆర్.యస్ నాయకులకు సిగ్గుండాలి అని అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద కుడి, ఎడమ కాల్వల నుండి 24 లక్షల ఆయ కట్టు సాగులో ఉందని ఎడమ కాల్వ కింద 12 లక్షల ఆయకట్టు సాగు అవుతోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద లక్ష కోట్ల దోపిడి చేసి ఒక్క ఎకరం నీళ్ళు పారకుండా నే మేడి గడ్డ ప్రాజెక్టు కూలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014 కంటే ముందు తెలంగాణ రాష్ట్రం 69 వేల కోట్ల అప్పుల్లో ఉందని అన్నారు. మిషన్ భగీరథ పేరుతో40 వేల కోట్లు తో శుభ్రమైన నీరు ప్రతి ఇంటికి తెలంగాణ లో ఇస్తున్నామని పార్లమెంటు లో ప్రస్తావించారనీ, గ్రామాల్లో ఎక్కడ మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకా ఖచ్చితంగా 6 హామీలను అమలు చేస్తాం అని హామీ ఇచ్చారు. చింతలపాలెం గ్రామం నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు జరిగినాయి మొదటగా గుజ్జుల రామిరెడ్డి, చింతల చెరువు కొండలు, చింతలచెరువు వీర్రాజు, ఎగుటి నాగరాజు, ఎగుటి వీరయ్య, మొర్రిమేకల శివాజీ, కాకునూరి నర్సిరెడ్డి, కందుల కోటిరెడ్డి, కుంకాల బాలకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎహెచ్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ అప్పిరెడ్డి, మండల అధ్యక్షుడు కొండారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంద్రారెడ్డి లకావత్ సైదులు పాల్గొన్నారు.

# నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా స్క్రూటీని చేయాలి

**- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్**

నల్లగొండ -ప్రభాత సూర్యుడు : జిల్లాలో అరు అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగనున్న ఎన్నికలలో నామినేషన్‌ల ప్రక్రియలోనామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అభ్యర్థుల తుది జాబితా ప్రకటనలో పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు.ఆదివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో రిటర్నింగ్ అధికారులకు, సిబ్బందికి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, పోటీ చేస్తున్న అభ్యర్థుల తుది జాబితా తయారీ, పోస్టల్ బ్యాలెట్ గురించి తగు సూచనలు చేశారు.ఇప్పటివరకు అందిన నామినేషన్ పత్రాలను ఎన్నికల కమిషన్ నిబంధనల ననుసరించి జాగ్రత్తగా ఈ నెల 13 న స్క్రూటినీ చేయాలని ఆదేశించారు. నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనల మేరకు పరిశీలన నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం పోటీలో నిలిచే తుదిజాబితాను పొరపాట్లు లేకుండా తయారుచేయాలని దిశానిర్దేశనం చేశారు. అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలు ప్రకారం కేటాయించాలన్నారు. అభ్యర్థుల తుది జాబితా ఆధారంగానే బ్యాలెట్ పత్రాలు ముద్రణ జరుగుతుందని చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని సూచించారు.ఎన్నికల విధుల్లో ఉన్న పీఓ,ఏపీఓ, ఓపీఓలకు ఈ నెల 6, 7వ తేదీలలో జరుగనున్న రెండవ విడత శిక్షణలో ఫారం 12ను అందచేసి పూర్తిగా అన్ని వివరాలతో నింపిన వాటిని సేకరించాలన్నారు.మూడో విడత శిక్షణలో శిక్షణా కేంద్రంలోనే పోస్టల్ బ్యాలెట్ ఓటు నమోదు చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నకిరేకల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్, రిటర్నింగ్ అధికారులు రవి, చెన్నయ్య, శ్రీరాములు, దామోదర్, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215